ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 24 ఫిబ్రవరి 2025



మయన్మార్‌లో ఉద్యోగాల పేరిట మోసం

ఆ దేశంలో చిక్కుకుపోయిన ముగ్గురు 'మాకవరపాలెం' యువకులు

స్వదేశానికి రప్పించేలా చర్యలు చేపట్టాలని స్పీకర్‌కు వినతి · 6లో



వబ్బలరెడ్డి మణికంఠ (ఫైల్)



ఇసంశెట్టి రాజేశ్ (ఫైల్)

రాళ్ల టిప్పర్లతో దడ!

భారీ వాహనాల్లో పరిమితికి మించి నల్లరాయి తరలింపు

- రవాణా శాఖ నిబంధనలు బేఖాతరు
- రోడ్డు మలుపులు, గోతుల వద్ద కింద పడుతున్న బండరాళ్లు
- మితిమీరిన వేగంతో టిప్పర్ల రాకపోకలు
- బెంబేలెత్తిపోతున్న వాహనదారులు, పలు గ్రామాల ప్రజలు
- మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్న రవాణా, పోలీసు శాఖల అధికారులు



టిప్పర్ లారీలో పరిమితికి మించి తరలిస్తున్న క్వారీ రాయి

కొత్తూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం కుంచంగి, వేటజంగాలపాలెం గ్రామాల పరిధిలో నుంచి భారీ వాహనాల్లో పరిమితికి మించి బండరాళ్లను రవాణా చేస్తున్నారు. టిప్పర్ బాడీ ఎత్తుకు మించి రాళ్లను నింపి, తూతూమంత్రంగా షేడ్ నెట్‌లను కప్పి తరలిస్తున్నారు. పటిష్ఠమైన భద్రతా చర్యలుచేపట్టకపోవడంతో రోడ్డు మలుపులు, గోతులు వున్నచోట టిప్పర్ లారీలు కుదుపులకు లోనై, రాళ్లు కిందపడుతున్నాయి. ఈ సమయంలో లారీలకు సమీపంగా వెళుతున్న ఇతర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పరిమితికి మించి బండరాళ్లను రవాణా చేయవద్దని రవాణా, పోలీసు శాఖల అధికారుల హెచ్చరికలను లారీల డ్రైవర్లు బేఖాతరు చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే కశింకోట-బంగారుమెట్ట (కేబీ రోడ్డు)లో రేయింబవళ్లు పరిమితికి మించి బండరాళ్లను టిప్పర్లలో రవాణా చేస్తున్నారు. ఆదివారం ఉదయం కొత్తూరు బ్రిడ్జిపై టిప్పర్ లారీ నుంచి పెద్ద బండరాయి ఒకటి రోడ్డుపై పడిపోయింది. ఈ సమయంలో టిప్పర్ పక్క నుంచి ఎవరూ వెళ్లకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనకాపల్లి, మాడుగుల, రోలుగుంట, రావికమతం, తదితర మండలాల్లో రాయి క్వారీల నుంచి పెద్ద పెద్ద బండరాళ్లను రాంబిల్లి మండలంలో నిర్మాణంలో వున్న ఎన్ఏవోబీకి తరలిస్తున్నారు. ఈ క్రమంలో రాళ్లను సరఫరా చేసే కాంట్రాక్టర్లు.. రవాణా చట్టం నిబంధనలను పాటించడంలేదు. రాయి క్వారీలు నిర్వహిస్తున్న మండలాలతోపాటు ఎన్ఏవోబీ వరకు మధ్యలో వున్న మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లిలో మండలాల్లో కూడా టిప్పర్ల నుంచి తరచూ బండరాళ్లు కిందపడుతున్నాయి. పరిమితికి మించి రాయిని రవాణా చేయడమే కాకుండా మితిమీరిన వేగంతో టిప్పర్ లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం వుందని ఆయా గ్రా మాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రవాణా, పోలీసు శాఖల అధికారులు స్పందించి, ఆయా మార్గాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, పరిమితికి మించి బండ రాళ్లను రవాణా చేసే వాహనాలపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కొత్తూరు బ్రిడ్జిపై లారీ నుంచి కిందపడిన పెద్ద బండరాయిని చూపుతున్న స్థానికుడు



అల్లూరి శత వర్ధంతి జాతా

స్వాతంత్ర సమరయోధుడు, మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా అఖిల భారత ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (ఏఐడీఎస్ఓ), విశాఖకు చెందిన పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో బస్సు జాతా నిర్వహించారు. శనివారం విశాఖలో ప్రారంభమైన ఈ యాత్ర సాయంత్రానికి నర్సీపట్నం చేరుకుంది. రాత్రికి ఇక్కడ బసచేసి ఆదివారం ఉదయం ఇక్కడి నుంచి బయలుదేరి గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి స్మారక పార్కు(సమాధులు)కు చేరుకుంది. అల్లూరి, గంటందొర సమాధుల వద్ద పుష్పాంజలి ఘటించారు. విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అల్లూరి జీవిత చరిత్ర గురించి నాటికను, సాంస్కృతి కార్యక్రమాలను ప్రదర్శించారు. - కృష్ణాదేవిపేట/ ఆంధ్రజ్యోతి

కృష్ణాదేవిపేటలో అల్లూరి శత వర్ధంతి జాతా నిర్వహిస్తున్న విద్యార్థులు

వరహా నదికి తూట్లు

పందూరుసహా పలు గ్రామాల వద్ద ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

కోటవురట్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): **మండలంలో వరహా నదిలో ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. స్థానిక అవసరాలకు అనుమతి పేరుతో దర్జాగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. రక్షిత మంచినీటి పథకాలకు సమీపంలో కూడా ఇసుక తవ్వేస్తుండడంతో వాటికి ముప్పు కలుగుతున్నది. నదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరుపుతుండడంతో గోతులు ఏర్పడి, ప్రమాదకరంగా మారుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**

- ఐదు అడుగుల లోతున కందకాలు
- తాగునీటి పథకాలకు ముప్పు
- సొంత అవసరాల మాటున ఇసుక వ్యాపారం చేస్తున్న నేతలు
- పట్టించుకోని అధికారులు



పందూరు వద్ద వరహా నదిలో ఇసుక తవ్వకాలు.. దూరంగా కనిపిస్తున్న రక్షిత తాగునీటి పథకం

అనకాపల్లి జిల్లాలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకునే వారు అధికారుల నుంచి అనుమతి తీసుకుని సమీపంలోని నదులు, గెడ్డల్లో ఇసుక తవ్వకుని తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు కోటవురట్ల మండలంలో పందూరు వద్ద మాత్రమే వరహా నదిలో ఇసుక తవ్వకాలకు మండల అధికారులు అనుమతులు ఇస్తున్నారు. ఇసుక అవసరమైన వారు సమీపంలోని గ్రామ సచివాలయంలో ఇంటి ప్లాన్‌తోపాటు దరఖాస్తు అందజేసి అనుమతి పొందాలి. సిబ్బంది అందజేసే స్లిప్పుతో 24 గంటల్లోగా నిర్ణీత పరిమాణంలో మాత్రమే ఇసుకను తవ్వి ఎడ్ల బండి లేదా ట్రాక్టర్ ద్వారా మాత్రమే తీసుకెళ్లాలి. కానీ మండలంలో పలుచోట్ల వరహా నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. పైగా ఐదు అడుగులకన్నా ఎక్కువ లోతుగా ఇసుక తోడుతున్నారు. నిబంధనల ప్రకారం వంతెనలు, చెక్ డ్యామ్‌లు, రక్షిత తాగునీటి పథకాలు, ఇతర కట్టడాలకు 500 మీటర్ల లోపు ఇసుక తవ్వకాలు జరపకూడదు. కానీ ఇక్కడ వంతెనలు, రక్షిత మంచినీటి ... మిగతా 6వ పేజీలో



వరహా నదిలో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతులు

చికెన్ అమ్మకాలు ఢమాల్

బర్డ్ ఫ్లూ వైరస్‌తో కోడిమాంసం వినియోగానికి జనం విముఖం

- పదో వంతుకు పడిపోయిన అమ్మకాలు
- ప్రత్యామ్నాయంగా చేపల కొనుగోలుకు ఆసక్తి
- కిటకిటలాడిన చేపల దుకాణాలు



చోడవరంలో కొనుగోలుదారులతో రద్దీగా వున్న చేపల దుకాణాలు

చోడవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): **బర్డ్ ఫ్లూ వైరస్.. చికెన్ ప్రియులను బాగానే భయపెడుతున్నది. ఈ ప్రభావం కోడి మాంసం విక్రయాలపై అధికంగా పడింది. ఆదివారంనాడు రద్దీగా ఉండే చికెన్ దుకాణాలు.. ఇప్పుడు కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి. బర్డ్ ఫ్లూ వైరస్ భయంతో చికెన్‌కు దూరంగా వుంటున్న మాంసాహారాలు ప్రత్యామ్నాయంగా మటన్, చేపల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. చేపల ధరతో పోలిస్తే మాంసం ధర నాలుగు రెట్లు అధికంగా వుండడంతో ఎక్కువ మంది చేపల కొనుగోలుకే మొగ్గు చూపారు. దీంతో పట్టణంలోని చేపల దుకాణాలు కిటకిటలాడాయి.**

రాష్ట్రంలో ఉభయ గోదావరి, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ ప్రబలడంతో చికెన్, కోడిగుడ్ల అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. వైరస్ ప్రబలినచోట కోళ్ల చంపి, పూడ్చిపెడుతున్నారు. వైరస్ ప్రభా వం లేని ప్రాంతాల్లో కూడా చికెన్ అమ్మకాలు అరకొరగానే సాగుతున్నాయి. దీంతో ఫారాల్లో బ్రాయిలర్ కోళ్లు పెరిగిపో తున్నాయి. ఈ పరిస్థితి కోళ్ల ఫారాల నిర్వాహకులకు భారం గా మారింది. అయినకాడికి ... మిగతా 6వ పేజీలో



కొనేవారు లేక వెలవెలబోతున్న చికెన్ దుకాణం

చికెన్ అమ్మకాలు బాగా పడిపోయాయి



ఎక్కడో బర్డ్ ఫ్లూ వైరస్ ప్రబలితే.. ఇక్కడ చికెన్ కొనుగోలుకు జనం భయపడుతున్నారు. పది రోజుల నుంచి చికెన్ అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. గతంలో సాధారణ రోజుల్లో వంద కిలోలు, ఆదివారం 200-250 కిలోల చికెన్ విక్రయించేవాడిని. ఇప్పుడు సాధారణ రోజుల్లో పది కిలోలు, ఆదివారం 25 కిలోలకు మించి అమ్మకాలు జనగడంలేదు. ఈ పరిస్థితి ఎంతకాలం ఉంటుందో తెలియడంలేదు. ప్రభుత్వం స్పందించి బర్డ్ ఫ్లూపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేయాలి.

- షేక్ షరీఫ్, చికెన్ వ్యాపారి, చోడవరం

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

85.04 శాతం మంది అభ్యర్థులు హాజరు

- ఉదయం 9,391, మధ్యాహ్నం 9,370 మంది..
- విశాఖ జిల్లాలో 16 కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు
- పరీక్ష తీరును పరిశీలించిన కలెక్టర్, జేసీ, సీపీ



ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో బారులుతీరిన అభ్యర్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కొమ్మాదిలో ఓ అభ్యర్థి పరీక్ష రాస్తూ తీవ్ర అస్వస్థతకు గురవడం, ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష గదులు గుర్తించడంలో కొందరు అభ్యర్థులు గందరగోళానికి గురవడం మినహా ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. పరీక్ష వాయిదా వేయాలని రెండు, మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న కొందరు అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వద్దకు వస్తారన్న సమాచారంతో నగరంలో అన్ని కేంద్రాల వద్ద పోలీసులు విస్తృతస్థాయిలో బందోబస్తు ఏర్పాటుచేశారు.**

అభ్యర్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు నిర్దేశిత సమయం కంటే ముందుగానే చేరుకున్నారు. ఉదయం 6.30 గంటలకు లైజన్ అధికారులు పరీక్షల మెటీరియల్‌తో కేంద్రాలకు చేరుకున్నారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి పోలీసు భద్రత మధ్య ప్రశ్నపత్రాలను కేంద్రాలకు తరలించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించిన పరీక్షకు ఉదయం ఎనిమిది గంటల తరువాత, మధ్యాహ్నం మూడు నుంచి జరిగే పరీక్షకు రెండు గంటల తరువాత అభ్యర్థులను లోపలకు అనుమతించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో అభ్యర్థులు క్యూకట్టారు. ప్రతి ఒక్కర్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం అనుమతించారు. అయితే ఇంజనీరింగ్ కళాశాలలో పలు విభాగాల్లో ఏర్పాటుచేసిన గదులు గుర్తించేలా నిర్వాహకులు సైన్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో అభ్యర్థులు గందరగోళానికి గరయ్యారు.

జిల్లాలోని 16 కేంద్రాల్లో పరీక్ష రాసేందుకు మొత్తం 11,030మంది దరఖాస్తుచేయగా ఉదయం 9,391 మంది (85.14శాతం), మధ్యాహ్నం 9,370 (84.95శాతం)హాజరయ్యారు. మొత్తం 85.04 శాతం అభ్యర్థులు హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఉదయం పరీక్ష రాసిన వారిలో 21 మంది ... మిగతా 6వ పేజీలో




అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసు

వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా కన్నబాబు

- పార్టీ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవిలో కొనసాగిన విజయసాయిరెడ్డి ఇటీవల వైసీపీకి రాజీనామా చేయడంతో ఆ స్థానంలో పార్టీ అధిష్ఠానం కన్నబాబును నియమించిన విషయం తెలిసిందే. కాగా ఊరేగింపుగా మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న కన్నబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి, విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేశ్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కన్నబాబు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎనిమిది నెలలకే కూటమి ప్రభుత్వం ప్రజల్లో పరపతిని కోల్పోయిందని విమర్శించారు. ఉత్తరాంధ్ర పరిధిలోని జిల్లాల్లో పర్యటించి నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తానన్నారు. రాష్ట్రంలో కూటమి పార్టీల కంటే వైసీపీ బలంగా ఉందన్నారు. ఒక్క గ్యాస్ మినహా సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏదీ అమలుచేయలేదన్నారు. అయినప్పటికీ రూ.1.2 లక్షల కోట్లు అప్పుచేశారని ఎద్దేవా చేశారు.



కన్నబాబును అభినందిస్తున్న గుడివాడ అమర్‌నాథ్, పార్టీ నాయకులు

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం నుంచి 27వ తేదీ సాయంత్రం వరకు ధారమఠం, కల్యాణపులోవ, ఎస్.కోటలోని పుణ్యగిరికి భక్తుల రాకపోకలకు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నర్సీపట్నం డిపో నుంచి కల్యాణపులోవకు 40, ధారమఠానికి 10.. మొత్తం 50 బస్సులు;. అనకాపల్లి డిపో నుంచి కల్యాణపులోవకు 35, పుణ్యగిరికి 10.. మొత్తం 45 బస్సులు నడపనున్నట్టు ఆమె తెలిపారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి కల్యాణపులోవకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం నర్సీపట్నం నుంచి 15 బస్సులు, కొత్తకోట నుంచి 10, రావికమతం నుంచి 10, కశిరెడ్డిపాలెం నుంచి 3, కొంతలం నుంచి రెండు బస్సులు నడుపుతున్నామని నర్సీపట్నం డిపో మేనేజర్ ఎంఎస్ఎస్ ధీరజ్ తెలిపారు. గొలుగొండ మండలం ధారమఠం వెళ్లే భక్తులు కోసం నర్సీపట్నం నుంచి నాలుగు, కృష్ణాదేవిపేట నుంచి రెండు, గొలుగొండ నుంచి మూడు, కంఠారం నుంచి ఒక బస్సు నడుపుతున్నామని ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రఘువర్మకు మద్దతుగా ఎన్నికల ప్రచారం



రఘువర్మకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, తదితరులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ఏపీటీఎఫ్ ప్రతినిధులు ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని వెంకటాపురం, ఉప్పరాపల్లి, లింగరాజుపాలెం గ్రామాల్లో ఉన్న ఓటర్లను ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు, మండల నాయకులతో కలిసి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు జి.సునీల్, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు, గోవిందరావు, రామకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మయన్మార్‌లో ఉద్యోగాల పేరిట మోసం

- ఆ దేశంలో చిక్కుకుపోయిన ముగ్గురు 'మాకవరపాలెం' యువకులు
- స్వదేశానికి రప్పించేలా చర్యలు చేపట్టాలని స్పీకర్‌కు వినతి
- మంత్రి కొండపల్లికి ఫోన్ చేసిన అయ్యన్న
- తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని భరోసా

మాకవరపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ముగ్గురు యువకులు, మయన్మార్‌లో ఉద్యోగాల పేరిట మోసపోయారు. గిడుతూరుకు చెందిన ఏజెంట్ల ద్వారా అక్కడకు వెళ్లిన సరైన ఉద్యోగాలు కల్పించలేదు. దీంతో స్వదేశానికి తిరిగిరావాలని భావించారు. అయితే అక్కడ వర్క్ పర్మిట్ సమస్యలు తలెత్తడంతో చిక్కుకుపోయారు.

మండలంలోని బూరుగుపాలెం గ్రామానికి వబ్బలరెడ్డి మణికంఠ, గిడుతూరు గ్రామానికి ఇసంశెట్టి రాజేశ్, మరో యువకుడు ఉపాధి కోసం కొంతకాల క్రితం గిడుతూరు గ్రామానికి చెందిన ఇద్దరు ఏజెంట్ల ద్వారా మయన్మార్ దేశానికి వెళ్లారు. ఇందుకోసం ఒక్కొక్కరికి నుంచి రూ.5 లక్షల వరకు ఏజెంట్లు వసూలు చేశారు. ఇందులో సగం సొమ్ము మయన్మార్‌లో ఉద్యోగాలు కల్పించే ఏజెంట్లకు ఇవ్వాల్సి వుంటుందని చెప్పారు. మయన్మార్ వెళ్లిన తరువాత యువకులకు సరైన ఉద్యోగం కల్పించలేదు. పైగా తక్కువ వేతనంతో బలవంతగా పనిచేయించేందుకు ప్రయత్నించారు. ఈ పరిస్థితి ఇబ్బందికరంగా వుండడంతో స్వదేశానికి తిరిగిరావాలనుకున్నారు. అయితే అక్కడ వర్క్ పర్మిట్ సమస్యలు తలెత్తడంతో చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని బూరుగుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కేతిరెడ్డి చిరంజీవితోపాటు యువకుల తల్లిదండ్రులు ఆదివారం స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఎన్ఆర్ఐ రాష్ట్ర వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ముగ్గురు యువకులను ఇండియాకు రప్పించే చూడాలని కోరారు. మయమాన్మర్‌లోని భారత రాయబార కార్యాలయంతో మాట్లాడి, ముగ్గురు యువకులను స్వదేశానికి రప్పించేందుకు అవసరమైన చర్యలు చేపడతానని మంత్రి హామీ ఇచ్చినట్టు స్పీకర్ చెప్పారు.

వరహా నదికి తూట్లు

... 5వ పేజీ తరువాయి

పథకాలకు అతి సమీపంలో కూడా ఇసుక తవ్వుతున్నారు. రామచంద్రపురం పంచాయతీ గూడుపులోవ సమీపంలో వరహా నదిలో భారీ రక్షిత మంచినీటి పథకం వుంది. ఇక్కడి నుంచి కోటవురట్ల, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో 36 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తుంటారు. దీనికి సమీపంలో ఎక్కువ లోతున ఇసుక తవ్వకాలు జరుపుతుండడంతో భూగర్భ జలాలు తగ్గిపోయి, వేసవితో తాగునీటి సరఫరాపై ప్రభావం పడుతుంది. వాస్తవంగా సొంత అవసరాలకు మాత్రమే నదిలో నుంచి ఇసుక తీసుకెళ్లాల్సి వుండగా, ఇక్కడ రాజకీయ నాయకులు ముఠాగా ఏర్పడి, దర్జాగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు.

చికెన్ అమ్మకాలు ఢమాల్

... 5వ పేజీ తరువాయి

తెగనమ్ము కోవడానికి నిర్ణయించుకుని తక్కువ రేటుకు (ఫారం వద్ద లైవ్ కోడి కిలో రూ.50-60కి) అమ్మేస్తున్నారు. అయినా సరే కొనుగోలు దారులు కరవయ్యారు. బర్డ్ ఫ్లూపై భయం వద్దని, చికెన్ తిన్నా ఏమీకాదని ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ అధికారులతోపాటు పౌల్ట్రీ కార్పొరేట్ కంపెనీలు చెబుతున్నప్పటికీ చికెన్ కొనుగోలుకు జనం ముందుకు రావడంలేదు. చోడవరం పట్టణంలో సుమారు 15 చికెన్ షాపులు వున్నాయి. ఆదివారంనాడు ఈ దుకాణాల వద్ద కొనుగోలుదారులు క్యూ కడుతుంటారు. బర్డ్ ఫ్లూ ప్రభావంతో గత వారం నుంచి చికెన్ దుకాణాలు వెలవెలబోతున్నాయి. మటన్ కొనుగోలు చేద్దామంటే కిలో రూ.900 వుండడంతో చేపల దుకాణాల బాటపడుతున్నారు. ఫలితంగా చేపల దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. చేపల రకం, సైజునుబట్టి కిలో రూ.130 నుంచి రూ.160 వరకు విక్రయించారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

... 5వ పేజీ తరువాయి



ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో బారులుతీరిన అభ్యర్థులు

మధ్యాహ్నం పరీక్షకు హాజరుకాలేదు. కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్ష రాసిన భీమిలి మండలం రేఖవానిపాలేనికి చెందిన పి.గంగరాజు మధ్యాహ్నం పరీక్షకు హాజరైన అరగంట తరువాత వాంతులు చేసుకోవడంతో ఇన్విజిలేటర్, చీఫ్‌సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. అతడికి రక్తపోటు తగ్గడంతో వెంటనే ప్రథమ చికిత్స చేసి, సమీపంలోని గాయత్రి వైద్య కళాశాలకు తరలించారు. కాగా నాగరాజు ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇదిలావుండగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షను కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రతబాగ్చి తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో న్యూక్లాస్‌రూమ్ కాంప్లెక్స్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రిజం డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటుచేసిన కేంద్రాలను పరిశీలించారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును డీఆర్వో భవానీశంకర్ కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షించారు. పోలీసులు అన్ని కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. పరీక్ష వాయిదా వేయాలని మూడు రోజులుగా ఆందోళన చేసిన అభ్యర్థులు ఆదివారం కేంద్రాలకు రాకపోవడంతో పోలీసులు, జిల్లా యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

కోటవురట్లలో దట్టంగా పొగ మంచు



కోటవురట్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుప్రాంతాల్లో రెండు రోజుల నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది. సంక్రాంతి పండుగ వెళ్లి నెలన్నర దాటినా పొగమంచు పడుతోంది. రెండు రోజుల ఉదయం 9గంటల వరకు మంచు దట్టంగా కురుస్తున్నది. పొగమంచుతో వాహనచోదకులు ఎదురు వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొగమంచు కారణంగా ఆశాజనకంగా జీడి, మామిడి పూతలు మాడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోటవురట్లలో పొగమంచు కురుస్తున్న దృశ్యం

ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు పశువైద్య భవనం

- నిర్మించి 13 ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాని వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



రాంబిల్లిలో నిర్మాణం పూర్తయిన పశువైద్య భవనం ఇదే

రాంబిల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించిన పశు వైద్య భవనం ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరుకుంది. 2012లో ఆర్ఐడీఎఫ్-10 నిధులు రూ. 10.61 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ పశువైద్య భవనానికి విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ప్రహరీ లేకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. ఈ పశువైద్య భవనం నిర్మాణం పూర్తయి13 సంవత్సరాలు గడుస్తున్న ప్రారంభానికి నోచుకోలేదు. కాగా ఈ భవనం గోడలు బీటలు వారిపోయాయి. ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. ఈ భవనం చుట్టూ అడవిని తలపించే విధంగా తుప్పలు బలిసి ఉన్నాయి. జూదరులు, మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు ఈ భవనం అడ్డాగా మారిపోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే పశువైద్య కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ భవనం కూడా పూర్తిగా శిథిలమై ఉండడంతో ఎప్పుడు కూలిపోతుందోని ఇక్కడి ఉద్యోగులు భయపడుతున్నారు. భవనం ప్రారంభానికి అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. ఈ పశువైద్య భవనానికి కరెంటు, తాగునీరు, ప్రహరీ గోడ సదుపాయాలను కల్పించి, వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి



పాయకరావుపేట సంపద కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న డీపీవో శిరీషారాణి

పాయకరావుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్త వేరుచేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఆర్.శిరీషారాణి ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర సర్వేలో భాగంగా ఆదివారం పట్టణంలోని కృష్ణవీధి, శెట్టిబలిజపేట తదితర ప్రాంతాల్లో పంచాయతీ అధికారులు తడి చెత్త, పొడి చెత్త వేరుచేయడంపై నిర్వహించిన అవగాహన సదస్సులను ఆమె పరిశీలించారు. అనంతరం పట్టణ శివారులో ఉన్న సంపద తయారీ కేంద్రంలోని పిట్‌లలో తయారవుతున్న వర్మి కంపోస్టును పరిశీలించి, కేంద్రం నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె స్థానిక అధికారులతో మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం డీఎల్‌పీఓ ఎస్ఎస్ఎస్ఎన్.మూర్తి, ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి అప్పల శివరాం, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, సిబ్బంది నాగార్జున పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను వినియోగించాలి

పాయకరావుపేట రూరల్: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలని, ఇంటింటి నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని డీపీవో ఆర్. శిరీషారాణి అన్నారు. ఆదివారం ఆమె నామవరంలో సంపద తయారీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకు రావాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది గ్రామాలలో అవగాహనా ర్యాలీలు నిర్వహించాలన్నారు. రోడ్లపై చెత్త, చెదారాలు వేయకుండా నిర్దేశిత ప్రదేశాలలో చెత్తను వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఎస్ఎస్ఎస్ఎన్ మూర్తి, ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖరరావు, కార్యదర్శులు మల్లికార్జున ఆచారి, శివ, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు. అలాగే మండలంలోని సత్యవరం, శ్రీరాంపురం, వెంకటనగరం, మంగవరం, పీఎల్.పురం, పెదరాంభద్రపురం, తదితర గ్రామాలలో ఆదివారం ఇంటింటి నుంచి చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

చికెన్ దుకాణాలు వెలవెల



కోటవురట్లలో ఆదివారం ఖాళీగా ఉన్న చికెన్ దుకాణం

కోటవురట్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ ప్రభావంతో రెండో ఆదివారం కూడా చికెన్ దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి. ధర తగ్గినప్పటికీ అమ్మకాలు భారీగా పడిపోయాయి. కోటవురట్లలో 12కి పైగా చికెన్ దుకాణాలు ఉన్నాయి. ఆదివారం వచ్చిందంటే కొనుగోలుదారులతో ఈ దుకాణాలు రద్దీగా ఉంటాయి. కానీ రెండు ఆదివారాలు అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి.గత రెండు వారాల నుంచి చికెన్ ధరలు కూడా తగ్గాయి. గత వారం కిలో రూ.190 ఉండగా.. ఈవారం 150కి పడిపోయింది. అంటే రెండు వారాల వ్యవధిలో చికెన్ రూ. 60 వరకూ తగ్గింది. మరో వైపు అమ్మకాలు 80 శాతంపైగా పడిపోయాయి. ప్రతిరోజూ హోటల్స్, రెస్టారెంట్లు, భోజనం హోటల్స్‌కు మాత్రమే విక్రయాలు జరుగుతున్నాయి. బర్డ్‌ఫ్లూ వ్యాధి అదుపులోకి వచ్చేవరకు అమ్మకాలు ఉండవని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబు



మునగపాక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతున్నాయి. నాగులాపల్లిలో పర్వతవర్ధినీ సహిత రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ ఏడాది కూడా వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈనెల 26వ తేదీ తెల్లవారుజాము నుంచి భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఉంటుందని కమిటీ పేర్కొంది. మునగపాక, వాడ్రాపల్లి, టి.సిరసపల్లి గ్రామాల్లో శివాలయాలను శివరాత్రి వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు.

పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం ముఖద్వారం

నూకతాత సంబరానికి హోం మంత్రికి ఆహ్వానం



హోం మంత్రి అనితను కలిసి టీడీపీ నాయకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని రాజయ్యపేట గ్రామంలో మత్స్యకారుల ఆరాధ్య దేవతైన నూకతాత సంబరానికి రావాలంటూ ఆ గ్రామస్థులు ఆదివారం హోం మంత్రి వంగలపూడి అనితను ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి నేతృత్వంలో వారు హోం మంత్రిని ఆమె నివాసంలో కలిసి ఆహ్వానించారు. రాజయ్యపేట కూటమి నాయకులు పిక్కి సత్తియ్య, పిక్కి గంగరాజు, పిక్కి కోదండరావు (బుజ్జి), మడదా రాంబాబు, పూజారి పిక్కి దేముడు, చిన్నారి, పెద్దియ్య, గోపీ హోంమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

రఘువర్మకు మద్దతుగా ఎన్నికల ప్రచారం



పాయకరావుపేటలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా కూటమి నాయకులు, ఏపీటీఎఫ్ నాయకులు ఆదివారం పట్టణంలో ప్రచారాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పట్టణంలోని రాజుగారిబీడు, తదితర ప్రాంతాల్లో పలువురు ఉపాధ్యాయులను కలిసి రఘువర్మను మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు దేవవరపు రాజబాబు, బొంది కాశీవిశ్వనాథం, కంకిపాటి వెంకటేశ్వరరావు, మజ్జూరి నారాయణరావు, మలిపెద్ది వెంకటరమణ, కురందాసు శివ, వి.అప్పారావు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెదిరెడ్డి పండు, జనసేన పార్టీ నాయకులు ఆచంట దొర, జగ్గన్నదొర, పలువురు ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

'పార్వతమ్మ సేవలు శ్లాఘనీయం'

- మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు



పప్పల చలపతిరావుని సన్మానించిన దృశ్యం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహిళా హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కర్రి పార్వతమ్మ సేవలు మరువలేమని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. మహిళానేత కర్రి పార్వతమ్మ రెండవ వర్ధంతిని తిమ్మరాజుపేటలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చలపతిరావు అచ్యుతాపురం, మునగపాక మండలాలకు చెందిన మహిళా నాయకులను ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళలు పప్పల చలపతిరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామసదాశివ రావు, రొంగలి రాము, మారిశెట్టి సూర్యనారాయణ, కోన లచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మను దర్శించుకున్న భక్తులు

మునగపాక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూలపేట గ్రామంలో కొలువైన గంగాలమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం : దొరస్వామి



శనివారం రాత్రి బస్సులో తనిఖీ చేస్తున్న దొరస్వామి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తమ కర్మాగారంలో పనిచేసే ఉద్యోగుల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని అధిస్తాన్ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. శనివారం రాత్రి ఆయన ఉద్యోగుల బస్సులను తనిఖీ చేశారు. ప్రతి రోజు కర్మాగారానికి రెండు వందల బస్సుల్లో ఉద్యోగులు రాకపోకలు జరుపుతున్నారు. ప్రయాణ సమయంలో వీరికి కలిగే అసౌకర్యాలతోపాటు భద్రత గురించి స్వయంగా తెలుసుకోడానికి తాను స్వయంగా పర్యవేక్షించానన్నారు. సరైన రహదారి సౌకర్యం లేక కొన్ని గ్రామాల్లోకి బస్సులు వెళ్లడం లేదని గమనించామని, అటువంటి వారికి ఆటోలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఉద్యోగి ఇంటి నుంచి బయలుదేరిన నుంచి విధులు ముగించుకొని తిరిగి ఇంటికి క్షేమంగా చేరే వరకు భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు.

చోడపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యునికి పితృవియోగం



మృతి చెందిన సూర్యనారాయణ

అచ్యుతాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోడపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు ధర్మిరెడ్డి సన్యాసి నాయుడు (బాబు)కి పితృ వియోగం కలిగింది. రామన్నపాలెంకి చెందిన ధర్మిరెడ్డి సూర్యనారాయణ(70) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు, బంధువుల, స్నేహితులు బాబు కుటుంబాన్ని పరామర్శించారు. సోమవారం రామన్నపాలెంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

భక్తిశ్రద్ధలతో సూర్యనారాయణ స్వామి కల్యాణం



సూర్యనారాయణస్వామి కల్యాణం జరుపుతున్న పురోహితులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి గొల్లల కొండపై ఉన్న సూర్యనారాయణ స్వామి తాత్కాలిక ఆలయం వద్ద ఆదివారం ఉదయం భక్తిశ్రద్ధలతో సూర్యనారాయణ స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కొండపై ఉన్న స్వామివారిని దర్శించుకుని కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. అనంతరం సాయంత్రం అంగరంగ వైభవంగా మహిళలతో కోలాటం, భజన కీర్తనలు ఆలపించారు. దేవతామూర్తుల కీర్తనలతో భజనలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ టౌన్ ఫీడర్ నిర్వహణ పనులు పనుల నిమిత్తం సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని మిలట్రీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలనీ, ప్రధాన రోడ్డు, ద్వారకానగర్, నెహ్రూనగర్‌ల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఈ-శ్రమ్ నమోదును వినియోగించుకోండి

ఎలమంచిలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ పోర్టల్‌ను ప్రవేశపెట్టిందని స్థానిక కార్మిక శాఖ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. అసంఘటిత రంగ కార్మికుల గుర్తింపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, 16 సంవత్సరాలు నుంచి 59 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన అంఘటిత రంగ కార్మికులుగా అర్హులని తెలిపారు. వార్డు సచివాలయాలు, సీఎస్‌ఈకేంద్రాలు ద్వారా, స్మార్ట్ ఫోన్ ద్వారా నమోదు చేసుకుని గుర్తింపు కార్డు పొందవచ్చునని తెలిపారు. ఆధార్ కార్డు జెరాక్స్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ అవసరం ఉంటుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు గుర్తింపు లభిస్తుందని, ప్రమాద మరణానికి బీమా రూ.2 లక్షలు అందుతుందని, శాశ్వత అంగవైకల్యానికి రూ.ఒక లక్ష ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరహా నదిలో స్వచ్ఛ జలం-స్వచ్ఛ మనసు



వమ్మవరం వద్ద వరహానదిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించి శుభ్రం చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరంలో ఆదివారం సంత్ నిరంకారీ మిషన్ గత సద్గురు బాబా హర దేవ్‌సింగ్ జీ జన్మదినం సందర్భంగా ప్రాజెక్టు అమృత్ స్వచ్ఛ జలం-స్వచ్ఛ మనసు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వరహానది, చెరువుల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్త, తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కశింకోట సెక్టర్ సంజోయకులు ఎ. చితంబరరావు, రాంబిల్లి ముఖి రామకృష్ణంరాజు, జి.వమ్మవరం ముఖి జి.నాగరాజు, పి.సత్యవతి, ఇన్‌చార్జి వి. రవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎస్.రాయవరంలో కలిసిన పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఎస్. రాయవరంలో ఆత్మీయంగా కలిశారు. పూర్వ విద్యార్థులు కర్రి నాగు, భీశెట్టి గణేష్, రామకృష్ణ, కారె కృష్ణ తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు సందడి చేశారు. వీరంతా ఒకరికిఒకరు పరిచయం చేసుకుంటూ, వారి వివరాలను తెలుసుకున్నారు. వారంతా పాఠశాలలో చోటుచేసుకున్న చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అంతేకాకుండా ఆటపాటలతో సంతోషంగా గడిపారు.అనంతరం మధ్యాహ్నం అందరూ కలిసి విందు చేశారు.

అనకాపల్లిపై మంచు ముసుగు

- వేకువజాము నుంచి ఏడున్నర గంటల వరకు ఇదే వాతావరణం
- వివిధ పనులపై బయటకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు
- లైట్లు వేసుకుని రాకపోకలు సాగించిన వాహనదారులు



పొగమంచులో పట్టణవాసులు వాకింగ్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణాన్ని ఆదివారం పొగ మంచు కమ్మేసింది. ఎదురుగా వచ్చే మనిషి సైతం కనిపించనవి విధంగా కురవడాన్ని చూసి అంతా ఆశ్చర్యపోయారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి ఇదే వాతావరణం నెలకొంది. వాకర్లు, వివిధ పనులపై బయటకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు కూరగాయలు తెచ్చే రైతులు, చిల్లర వర్తకుల అవస్థలు మరింత అధికమయ్యాయి. ఏడున్నర గంటల నుంచి మంచుతెరలు వీడడం ఆరంభమయ్యాయి.

'ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించండి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకర్

సబ్బవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఉద్యాన శాఖ అధికారులు అందుబాటులో ఉండాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి జి.ప్రభాకర్ సూచించారు. ఇక్కడి జాగృతి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఆదివారం సబ్బవరంతో పాటు పలు మండలాల్లోని ఉద్యాన సహాయకులతో ఉద్యాన అధికారిణి కిరణ్మయి ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను వారికి ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. యంత్ర పరికరాలు, బిందు సేద్యం, తుంపర సేద్యం తదితరాలకు అందిస్తున్న రాయితీలను వివరించాలని సూచించారు. జీడి, జీడిమామిడి పూత దశలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం టమాటా పంటకు మార్కెంటింగ్, గిట్టుబాటు ధర తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు.

అనకాపల్లిలో చికెన్, ఎగ్ మేళా రేపు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు, వైద్యులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం చికెన్, ఎగ్ మేళా నిర్వహించనున్నట్టు నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ, పౌల్ట్రీ రంగ ప్రతినిధులు భర్నికాన రామారావు, భర్నికాన బాబూరావు, కె.గంగిరెడ్డి, భాస్కర్, మందపాటి జానకిరామరాజు, కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకకు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ అనకాపల్లి అధ్యక్షులు డాక్టర్ జి.రామ్మూర్తి, పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ మాట్లాడుతూ చికెన్, ఎగ్‌లలో పోషకాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అవి తినడం వల్ల ఎటువంటి హాని జరగదని పేర్కొన్నారు. వంద గ్రాముల చికెన్ తింటే ఆరోగ్యానికి మంచిదన్నారు. ఎగ్ తినడం వల్ల ఎటువంటి కొలస్ట్రాల్ చోటు చేసుకోదన్నారు. ముఖ్యంగా స్కిన్‌లెస్ చికెన్ తింటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నెక్, పౌల్ట్రీ రంగ ప్రతినిధులు శ్రీధర్, గంగిరెడ్డి, మేకా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎన్ఎంయూఏ కార్మికులు ధర్నా

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించి, 1/19 సర్క్యులర్‌కు విరుద్ధంగా కండక్టర్ ఎస్ఎస్ నారాయణను అక్రమంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ ఇక్కడి ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూఏ కార్మికులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ సెక్రటరీ పి.సుధాకర్, జాయింట్ సెక్రటరీ జీఎస్‌రావు మాట్లాడుతూ కండక్టర్ నారాయణ సస్పెన్షన్‌ను రద్దు చేసి తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో న్యాయం జరిగే వరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. యూనియన్ డిపో అధ్యక్షుడు ఏఎన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిని ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థిని విజయగౌరీ తదితరులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పూడిమడక రోడ్డు, చవితిన వీధి, విద్యుత్‌నగర్, కస్పావీధి, మసీదు వీధుల్లో ఆదివారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిని కోరెడ్ల విజయగౌరీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆమె వెంట యూనియన్ ప్రతినిధులు శ్రీలక్ష్మి, రాజేష్, సతీష్, బి.ఉమామహేశ్వరరావు, జె.రమేష్ తదితరులు ఉన్నారు.

సచివాలయం బోర్డుపై జగన్ ఫొటో మూసివేసిత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బోర్డుపై జగన్ ఫొటో మూసి ఉన్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెంలో గల వార్డు సచివాలయంపై ఉన్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోను జీవీఎంసీ అధికారులు మూసివేశారు. వైసీపీ అధికారం కోల్పోయి, కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా గవరపాలెం మరిడిమాంబ ఆలయం వద్ద గల 21వ వార్డు సచివాలయం బోర్డుపై జగన్ ఫొటో ఉండడాన్ని గుర్తించి 'ఇంకా జగన్ జపమే' శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు సదరు బోర్డుపై ఉన్న జగన్ ఫొటోను సిబ్బందితో మూసివేయించారు.

చెత్త సమస్యకు చరమగీతం

- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక దృష్టి
- ఇళ్లకు వచ్చిన పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను విధిగా అందించండి : డీపీవో శిరీషా రాణి



తుమ్మపాలలో పరిసరాల పరిశుభ్రత వల్ల ప్రయోజనాలపై కరపత్రాలను అందిస్తున్న డీపీవో శిరీషారాణి

తుమ్మపాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి సారించినట్టు డీపీవో ఆర్.శిరీషారాణి తెలిపారు. ఆదివారం అనకాపల్లి మండలం తుమ్మపాల, రేబాక తదితర గ్రామాల్లో ఆమె పర్యటించారు. పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించకుంటే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఇళ్ల వద్దకు వచ్చిన పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి అందజేయాలని సూచించారు. ఇటువంటి చెత్తను సంపద కేంద్రాలకు తరలించి ఎరువుగా తయారు చేస్తామన్నారు. తద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని వివరించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత వల్ల ప్రయోజనాలపై కరపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, తుమ్మపాల పంచాయతీ ఈవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, తుమ్మపాలలో జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డులలో రోడ్లకు ఇరువైపులా ఉన్న తుప్పలను సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు మాట్లాడుతూ పంచాయతీలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వివరించారు ఈకార్యక్రమంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కశింకోటలో పారిశుధ్య పనులు

కశింకోటలో పారిశుధ్య పనులు

కశింకోట : మండల కేంద్రం కశింకోటలో పారిశుధ్య పనులను డీపీవో శిరీషారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి పారిశుధ్య పనుల తీరును తెలుసుకున్నారు. ఏ రోజుకు ఆరోజు చెత్తను తొలగించాలని, కాలువలను శుభ్రం చేయాలని, పూడిక తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు గత ప్రభుత్వం మోసం

- పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం
- యూటీఎఫ్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్ర ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటైన యూటీఎఫ్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. అప్రెంటీస్ విధానం రద్దు, డీఏల సాధన, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పీఆర్సీ, కౌన్సిలింగ్ విధానం అన్నీ పోరాడి సాధించుకున్నవేనని వివరించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ 11వ పీఆర్సీలో 23శాతం మాత్రమే ఫిట్‌మెంట్ ఇచ్చి గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులను మోసం చేసిందన్నారు. ఇప్పుడు 12వ పీఆర్సీ, డీఏలు, ఆర్థిక బకాయిలు ఇవ్వకుండా ప్రస్తుత ప్రభుత్వం కూడా కాలయాపన చేస్తుందని వాపోయారు. వీటిని సాధించుకోవడానికి పోరాట మార్గాన్ని ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్, జోగా రాజేష్, మామిడి బాబూరావు, సత్యవేణి, వి.రమేష్‌రావు, నాతవరపు సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై పోలీసులు కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గాంధీనగరంలోని అద్దె ఇంట్లో నివాసముంటున్న వ్యక్తి ఆకస్మిక మృతిపై ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలివి. తమిళనాడుకు చెందిన కదిరేషన్ గణపతి (54), వాణి దంపతులు వ్యాపార రీత్యా చాలాకాలం క్రితం అనకాపల్లి వచ్చారు. అయితే భార్యభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. గణపతి గతంలో వ్యాపారం చేసేవారు. ఇతనికి మద్యం అలవాటు ఉంది. శుక్రవారం సాయంత్రం కనిపించిన వ్యక్తి శనివారం సాయంత్రం వరకు తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని నరసింగరావు కిటికీ తెరిచి చూడగా, లోపల గణపతి మృతి చెంది కనిపించాడు. దీనిపై వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నరసింగరావుపేటలో ఉంటున్న మృతుని భార్య వాణికి ఈ విషయం తెలియడంతో ఆమె వచ్చి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అతిగా మద్యం సేవించడం వల్లే మృతి చెంది ఉంటాడని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో అగ్నిప్రమాదం

- చెత్త కుప్పకు నిప్పు అంటడంతో మంటలు
- ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూచౌక్ సమీపంలోని పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడ నున్న చెత్తలో గుర్తు తెలియని వ్యక్తి కాల్చిన సిగిరెట్ పడేయడంతో మంటలు చెలరేగాయి. ఇది గుర్తించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే వారు వచ్చి అంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఎటువంటి ఆస్తినష్టం జరగలేదని అగ్నిమాపక శాఖాధికారి తెలిపారు.

మద్యం బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. స్థానిక చింతావారి వీధిలో శనివారం రాత్రి మునగపాక మండలం గంటవానిపాలేనికి చెందిన పచ్చిగోళ్ల సర్వేశ్వరరావు అనే వ్యక్తి వెళుతుండగా, అనుమానం వచ్చి హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తనిఖీ చేశారన్నారు. అతని వద్ద పదిహేను మద్యం క్వార్టర్ బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరంకేసు నమోదు చేసినట్టు చెప్పారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురు అరెస్టు

- మైనర్ జువెనైల్ హోంకు తరలింపు
- కారుతో పాటు ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం
- నిందితులంతా తెలంగాణ రాష్ట్రానికి చెందినవారే

కొత్తూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కారులో గంజాయి తరలిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగుర్ని అదుపులోకి తీసుకున్నట్టు అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం సాయంత్రం అనకాపల్లి మండలం కుంచంగి సమీపంలో మాటు వేశామన్నారు. ఇంతలో ఓ కారు వస్తుండగా తనిఖీలు చేపట్టామన్నారు. అందులో ఆరుగురు వ్యక్తులు ఎనిమిది కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుబడినట్టు చెప్పారు. కారులో నాగర్ కర్నూలుకు చెందిన అలకుంట శివరాజ్, మహబూబ్‌నగర్‌కు చెందిన బి.అశోక్, ఇప్పటి ప్రసాద్, ముత్యాల వివేకానంద, కొమ్మిరి శివలతో పాటు, ఒక మైనర్ ఉన్నాడన్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, మైనర్‌ను జువెనైల్ హోంకు తరలించినట్టు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ శిఖరాల్లో కలశ స్థాపన



మొగలిపురం ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గండి బాబ్జీ దంపతులు



వేడుకలకు హాజరైన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ దంపతులు



ఉగ్గినపాలెంలో కలశ పునః ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

సబ్బవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగలిపురం గ్రామ శివారులో నిర్మించిన వీరాంజనేయ ఆలయ శిఖరంపై కలశ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు చింతా వెంకట సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అర్చక బృందం శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ దంపతులు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారా యణమూర్తి దంపతులు, మాజీ మంత్రులు బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వీకేపీసీపీఐఆర్ మాజీ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, నాయకులు గండి రవికుమార్, వంశీదీప్, తమరాన బంగారునాయుడు, ఎడ్ల నాయుడు, అంగటి నానాజీ, ఐ.డి.బాబు, జి.ఎం.నాయుడు, సురేష్, కన్నంనాయుడు, మోహన్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కశింకోట : ఉగ్గినపాలెంలో నిర్మించిన రామాలయ శిఖరంపై పసిడి కలశ పునః ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్మీలో పని చేసి పదవీ విరమణ పొందిన కలగా వెంకటేశ్వరరావు, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, మాజీ సర్పంచ్ కలగా సోమేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఈ కలశానికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాల అనంతరం ఆత్మీయ కలయిక



పాఠశాలలో కలుసుకున్న 1975 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్

కొత్తూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏఎంఏఎ హైస్కూల్‌లో 1975 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా ఆదివారం కలుసుకున్నారు. ఐదు దశాబ్దాల అనంతరం అంతా ఓచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేవు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పలువురు గురువులను సత్కరించారు. అంతేకాకుండా తమ సొంత డబ్బులు రూ.ఏడు లక్షలతో పాఠశాలలో ఉన్న కాన్ఫరెన్స్ హాలును పునరుద్ధరించి అప్పగించారు.

సూర్యనారాయణస్వామి ఆలయం భక్తులతో కిటకిట



సూర్యనారాయణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మాఘమాసం చివరి ఆది వారం కావడంతో పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్‌లో గల సత్యనారాయణస్వామి, సూర్యనారాయణస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు సూర్య నమస్కారాలు చేసి, స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ, ధర్మకర్తలు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు గొర్లివానిపాలెంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



సబ్బవరం,ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : గొర్లివానిపాలెంలో ఉమారామలింగేశ్వర, లక్ష్మీ సత్యనారా యణ మూర్తి, కోదండ సీతారామస్వామివార్ల దేవస్థానంలో సోమవారం మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు ఈ వేడుకలు జరిపేందుకు సన్నాహాలు చేపడుతున్నారు. తొలిరోజు ఉదయం పది గంటలకు విఘ్నే శ్వర పూజతో ప్రారంభంకానున్నాయి. శివరాత్రి రోజు బుధవారం ఉదయం నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. రాత్రి ఏడున్నర గంటలకు స్వామి, అమ్మ వారి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త అచ్చింనాయుడుతో పాటు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా వారు కోరారు.

నేడు వీఎల్ఎన్ పురంలో బోయమాంబ ఆలయ వార్షికోత్సవం



పరవాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పి.బోనంగి శివారు వీఎల్ఎన్ పురంలో సోమవారం బోయమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

భద్రాచలానికి రామ భక్తులు ప్రయాణం

కశింకోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పరవాడపాలెంలో సీతారాముల ఆలయ భక్తులు డబ్బై మంది ఆదివారం భద్రాచలానికి బస్సులో బయల్దేరి వెళ్లారు. ఆలయ వ్యవస్థాపకులు గొంతిన శివబాబు ఆధ్వర్యంలో ఏటా చేపడుతున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో భాగంగా వీరిని తన సొంత నిధులతో రాముల వారి దర్శనానికి తీసుకు వెళ్లారు.

భోగలింగేశ్వరస్వామి ఆలయ అర్చకునికి సత్కారం



చిన్నిస్వామిని సత్కరించిన శివ భక్తులు

అనకాపల్లిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : భోగలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులుగా పనిచేస్తున్న పేరూరి చిన్నిస్వామి ఇటీవల హైదరాబాద్‌లో ఐకాన్ అవార్డు అందుకోవడంతో అతనిని ఆదివారం శివమాల ధరించిన భక్తులు ఇక్కడ సత్కరించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ యల్లపు చంద్రమోహన్, మళ్ల గోపి, కాండ్రేగుల దాస్, వి.నాని, కె.ప్రసాద్, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

ఇంటర్వ్యూ..

» డుంబ్రిగుడ ఎంపీడీవో ప్రేమ్‌సాగర్



ఎండీవో ప్రేమ్‌కుమార్

డుంబ్రిగుడ మండలంలో రానున్న వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో ప్రేమసాగర్ తెలిపారు. సమస్యలున్న గ్రామాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఆయన 'ఆం ధ్రజ్యోతి'తో మాట్లాడారు. వివరాలివి.

ప్రశ్న. మండలం లో ముందస్తు తాగునీటి ఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: మండలంలోని ప్రతి మారుమూ ల గ్రామాలకు వెళ్లిఏటా వేసవి ముందు తాగునీటి బోర్లు, రక్షిత పథకాలను గుర్తిస్తున్నాం. మరమ్మతుకు లోనైన బోర్లను గుర్తించి వినియోగంలోకి తీసుకువస్తున్నారు.

ప్రశ్న: గ్రావిటీ, రక్షిత పథకాలు ఎన్ని మరమ్మతు పాలయ్యాయి? వీటి మరమ్మతు ఈ ఏమేరకు నిధులు విడుదలయ్యాయా?

జవాబు: ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీటి పథకాల నిర్వాహణ కొనసాగుతోంది. తాగునీటి పథకాల మరమ్మతులు, పథకాల నిర్మాణ పనులు చేయించి తాగునీటి కొరత లేకుండా చూసుకోవాలని ఆ శాఖ అధికారులను ఆదేశాలు జారీ చేశారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని బోర్లు ఉన్నాయి, వీటిలో ఎన్ని మరమ్మతుకు గురైయ్యాయి?


జవాబు: తాగునీటి సౌకర్యం లేని గ్రామాలను గుర్తించి ఆ గ్రామాల్లో బోర్లు, గ్రావిటీ రక్షిత పథకాల ద్వారా బోర్లు వేసి కొళాయిల ద్వారా నీటిని అం దించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.ఇప్పటికే వివిధ గ్రామాల్లో వినియోగంలోకి తెచ్చిన బోర్లు 20 నుంచి 24వరకు ఉన్నాయి. మిగిలిన గ్రా మాల్లోనూ సమస్యలు గుర్తిస్తున్నాం.

ప్రశ్న: మండల పరిషత్ నిధులతో ఏఏ పనులు చేపడుతున్నారు.? ప్రస్తుతం అభివృద్ధి పనులు ఏ దశ లో ఉన్నాయి?

జవాబు: మండల పరిషత్ నిధులతో చేపడుతున్న పనులపై పూర్తి వివరాలు అందుబాటులో లేవు. సేకరించి అందిస్తాం.

-డుంబ్రిగుడ, ఆంధ్రజ్యోతి

నేటి నుంచి బౌడ శివాలయంలో ప్రత్యేక పూజలు



ఉత్సవాలకు ముస్తాబయిన బౌడ శివాలయం

చింతపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బౌడ శివాలయంలో సోమవారం నుంచి బుధవారం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రతి రోజు ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చన, హోమాలు నిర్వహిస్తామన్నారు. భక్తుల కోసం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ప్రత్యేక పూజలను విజయవంతం చేయాలని కోరారు.

పారాలీగల్ వలంటీర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

చింతపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పారాలీగల్ వలంటీర్‌గా పనిచేసేందుకు ఆసక్తిగల యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎం. రోహిత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు న్యాయపరమైన సలహాలు, న్యాయ సహాయం అందించేందు కు ఔత్సాహికులు ఈ మేరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కనీస విద్యార్హత పదోవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, సేవా సంస్థల్లో పనిచేసిన వ్యక్తులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. అభ్యర్థులు ఈనెల 25తేదీలోగా చింతపల్లి న్యాయస్థానంలోనున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయానికి అందజేయాలన్నారు. దరఖాస్తుతోపాటూ ఆధార్ కార్డు, విద్యార్హత జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోను అందజేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జీతం, గౌరవ వేతనం ఉండదని తెలిపారు.

బేబీ ఫీడింగ్ రూమ్స్ ఏర్పాటు



అనంతగిరి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ రూమ్..

అనంతగిరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలోని బేబీ ఫీడింగ్ రూమ్ (శిశువులకు పాలిచ్చే గది) ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో ఏవీవీకుమార్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే చిన్నారుల తల్లులు పాలించేందుకు ఇబ్బందులు పడుతుంటారు.. దీనిని దృష్టిలో పెట్టుకుని, బేబీ ఫీడింగ్ రూమ్‌ను ఏర్పాటు చేయాలనికలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించారన్నారు. ఈ మేరకు అనంతగిరి, భీమవరం, పినకోట, లంగుపర్తి నాలుగు పీహెచ్‌సీలతో పాటుగా మండల రెవెన్యూ కా ర్యాలయం, తాకిడిబట్టి, ప్రధాన సచివాలయాలు వద్ద ఒక్కో రూమ్‌ను కేటాయించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో వివరించారు. ఈ కార్యక్రమంలోని సీడీపీవో సంతోషికుమారి, తదితరులు ఉన్నారు.



జి. మాడుగులలో వాహనాల మధ్యలో తిష్ట వేసిన పశువులు



కొక్కిరాపల్లి మలుపుల వద్ద బారులుతీరిన పశువులు

ప్రధాన రహదారిలో పశువుల బెడద

» జనాల రాకపోకలకు ఇక్కట్లు

» ప్రమాదాల బారిన వాహనదారులు

జి.మాడుగుల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రధాన రహదారిలో పశువులు బెడద తీవ్రంగా ఉన్నది. మండల కేంద్రం మొదలుకుని చింతపల్లి మండలం అన్నవరం వరకు ఈ సమస్య నెలకొంది. మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఒకవైపు, పశువులు రోడ్డు రోడ్డుపైకి రావడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో వాహనదారులతోపాటు పాదచారుల సైతం అంతరాయం కలుగుతోంది. జి.మాడుగుల- చింతపల్లి ప్రధాన రహదారిలో కొక్కిరాపల్లి ఘాట్‌లో రాత్రి పగలు రోడ్డు మీదనే పశువులు తిష్ట వేస్తున్నా యి. రేలంగిపుట్టు సమీపంలో ఆరోగ్య శాఖకు చెందిన ఓ ఉద్యోగి పశువులకు తప్పించే ప్రయత్నంలో ద్విచక్రవాహనం బోల్తా పడి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ సమస్య వేసవిలో ప్రారంభమై వర్షాలు పడే జూలై వరకు కొనసాగుతోంది. పశువులతో పలు చోట్ల ట్రాఫిక్ అంతరాయం కలగడమే కాకుండా ప్రమాదాలకు కారణమవుతోంది. సంబంధిత అధికారులు పశువులు యజమానులకు అవగాహన కల్పించి వీటిని నిరోధించాలని పలువురు కోరుతున్నారు.

పశువులు రోడ్డపైకి రావడానికి ప్రధాన కారణం

సాధారణంగా ఏజెన్సీ ప్రాంతంలో వ్యవసాయ పనులు డిసెంబరు వరకు మాత్రమే ఉంటాయి. ఆ తరువాత పశువులతో వ్యవసాయ పనులు ఉండవు., ఫలితంగా తమ పశువులను సమీప ప్రాంతాలకు తరలించి వదిలివేయడంతో అవి రోడ్డపైకి వచ్చి సేదతీరి మళ్లీ మేపు కోసం అడవిలోకి వెళ్లి తిరిగి రోడ్లపైకి చేరడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు మద్దతుగా ప్రచారం

పాడేరురూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ, వివిధ ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మ విజయానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నాయకులతో కలిసి ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఇంగ్లీషు మీడియం పాఠశాల, శ్రీకృష్ణాపురం, తదితర పాఠశాలతో పాటు జి.మాడుగుల మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమావేశమై రఘువర్మను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ ప్రచారంలో పరిశీలకులు రాజమండ్రి నారాయణ, తోట రత్నం, సబ్బిడి ఉమ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, మాజీ ఎంపీపీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొర్రా విజయరాణి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు బుక్కా జగదీష్, మాజీ సర్పంచ్ రేగం కొండబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని కలిసి రఘువర్మకు మద్దతు తెలుపుతున్న కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు

చింతపల్లిలో..

చింతపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, ఏపీటీఎఫ్, ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని టీడీపీ సీనియర్ నాయకుడు రీమల ఆనందరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉపాధ్యాయుల గృహాల వద్దకు వెళ్లి ఈ మేరకు ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలంటే రఘువర్మ గెలుపొందాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు అప్పారావు, పెద్ద, అనిల్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: పాలకపాటి రఘువర్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ పార్టీ డివిజన్ నేత, దారెల పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగస్వామి కోరారు. ఆదివారం లబ్బూరు పాఠశాలలో ఉపాధ్యాయులను ఆయన కలిశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ మండల కార్యదర్శి కె.జగత్, లక్ష్మీపేట మాజీ సర్పంచ్ ఎన్.ప్రసాదు, నాయుకులు లైకోన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఇంటిలో చెత్త సేకరణ



గొందూరులో ఇంటింట చెత్త సేకరణలో డీపీవో లవరాజు, తదితరులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పాడేరు గొందూరులో చేపట్టిన ఇంటింట చెత్త సేకరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు తెలిపారు. శని, ఆదివారం జిల్లా వ్యాప్తంగా 430 గ్రామ పంచాయతీలలో 86,402 ఇళ్లలో ఇంటింట చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టామన్నారు. పాడేరు పంచాయతీ పాడేరు గొందూరు ప్రాంతంలో ఆదివారం 970 కిలోల పొడి చెత్త, 810 కిలోల తడిచెత్త, 6,320 ప్లాస్టిక్ బాటిల్స్, 650 కిలోల ప్లాస్టిక్, చెత్త పేపర్లు, పుస్తకాలు 360 కిలోలు సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు వి.చిన్ని తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం: జడ్పీ చైర్‌పర్సన్



సరియాపుట్టుకు కాలినడకన వెలుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వ్యాధులు బారిన పడకుండా ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ సరియాపుట్టు గ్రామంలో పలువురు ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆమె ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించారు. కొంత దూరం కాలినడకన అక్కడికి చేరుకున్నారు. బాధితులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని ఇచ్చారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే ఏ చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా వైద్య సిబ్బందిని సంప్రదించాలని అన్నారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్యను కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి సుభాష్, వైసీపీ నేతలు జేవీవీఎన్ మూర్తి, తిరుపతి, ప్రసాదరావు తదితరులున్నారు.

విద్యుత్ తీగలు తెగిపడి తోటలు దగ్ధం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోవ్వ పంచాయతీ కమలబంద గ్రామ సమీపంలో శనివారం రాత్రి విద్యుత్ తీగలు తెగిపడి, వాటినుంచి వెలువడిన నిప్పు రవ్వలకు అకేషియా తోటలు దగ్ధమయ్యాయి. రాత్రి పూట ఈ ప్రమాదం జరగడంతో పశువులకు ప్రమాదం తప్పిందని గిరిజనులు తెలిపారు. విద్యుత్తు తీగలు తెగిపడడంతో గ్రామానికి సరఫరా నిలిచిపోయింది. గ్రామస్థుడు గురునాయుడు సమాచారమివ్వడంతో విద్యుత్ శాఖ అధికారులు వచ్చి స్థానికుల సాయంతో తీగలు సరి చేసి విద్యుత్తును పునరుద్ధరించారు.



దగ్ధమైన అకేషియా తోటను చూపుతున్న బాధితులు



కొయ్యూరు స్టేషన్ ఆవరణలో స్వాధీనం చేసుకున్న ఆటోలు



తుప్పుపట్టిపోతున్న దిచక్రవాహనాలు

సీజ్ చేసిన వాహనాలకు తుప్పు

» పోలీసు స్టేషన్‌లో పేరుకుపోతున్న గంజాయి రవాణా, ప్రమాద ఘటనల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు

» విడిపించేందుకు అడ్డంకులు

కొయ్యూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలు తదితర కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు తుప్పు పట్టి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. గుట్టలుగా పేరుకుపోతుండడంతో భద్రపరచేందుకు తగిన రక్షణతో కూడిన స్థలం లేక పోలీసు స్టేషన్ ఆవరణ, సిబ్బంది క్వార్టర్ల మధ్య వదిలేస్తున్నారు. వీటిలో విషసర్పాలు చేరడంతో సి బ్బంది ఇబ్బందులు పడుతున్నారు. గంజాయి రవాణా కేసుల్లో వ్యక్తులు వీటిని విడిపించేందుకు ముందుకు రాకపోవడంతో రూ. లక్షల విలువైన వాహనాలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. అలాగే, కేసులు పరిష్కారం అయిన వాహనాలను ప్రతీ ఆరు నెలలకోసారి వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశంుంది. కానీ, ఈ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. క్రమేపీ వాహనాలు పాత ఇనుము కొనే వారికి విక్రయించాల్సిన దుస్థితి నెలకొంటోంది. కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్లు పరిధిలో 2012 సంవత్సరంనుంచి వివిధ కేసుల్లో సీజ్ చేసిన కార్లు, లారీలు, వేన్‌లు, ఆటోలతో పాటు ద్విచక్ర వాహనాలు సుమారుగా 100కు పైగా ఉన్నాయి. ఈ వాహనాలన్నీ కొయ్యూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది నివాస గృహాలకు ఎదుట, కొన్ని స్థలాభావంతో కొన్ని కొత దూరంలో దర్శనమిస్తున్నాయి. ఇవి వానకు తడుస్తూఎండా వానలనుంచి రక్షణలేక తుప్పు పడుతున్నాయి. ప్రమాదం అయిన, లేదా ఏ ఇతర కారణాలతో సీజ్ చేసిన వాటిలో ఎ క్కువ శాతం వాహనాలను యజమానులు విడిపించుకు వెళ్లిపోతున్నారు. గంజాయి కేసులో రవాణాకు వినియోగించినవి, అ రవాణా సమయంలో పైలట్‌గా వ్యవహరించే వారి సీజ్ చేసిన వాహనాలు వీటిలో ఎక్కువగా ఉంటున్నాయి. వీటిని విడిపించుకునేందుకు న్యాయపరమైన చిక్కులు ఉంటాయి. వీటిని బయటకు తీసుకురావాలంటే పెద్ద యజ్ఞం చేయాలి. ఈ స్థితిలో వాహన యజమానులు వీటిని విడిపించాలనే ఆలోచనకు స్వస్తి పలుకుతున్నారు. దీంతో ఇటువంటి కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు రోజు, రోజుకు పెరుగుతూ కుప్పలుగా పేరుకుపోతున్నాయి. కొన్ని కోర్టుల్లో కేసులు కొనసాగుతుండటం వీటి పరిష్కారానికి సంవత్సరాలు గడిచే పరిస్థితి ఉంది. అప్పటికి సీజ్ చేసిన వాహనాలు ఎందుకూ పనిరాకుండా పోతున్నాయి. అన్ని పూర్తయిన తర్వాత యజమానులకు పోలీసువారు నోటీసులు ఇచ్చినా వారి నుంచి స్పందన కరువవుతోంది. అయితే వివిధ కేసుల్లోనూ లేదా ప్రమాద ఘటనల్లో తీసుకువచ్చిన వాహనాలు రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేసి ఆరునెలలకోసారి బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని పలువురు అభి ప్రాయం వ్యక్తంచేస్తున్నారు.



విడిపించుకు వెళ్లని కారులు

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాలతో పాటు మైదాన ప్రాంతానికి చెందినభక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం శాస్త్రి అమ్మవారికి పూజలను నిర్వహించారు. మైదాన ప్రాంత భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకొని బంధు మిత్రులు, కుటుంబ సభ్యులతో భోజనాలు చేసి సాయంత్రం వరకు గడిపారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు ఉదయం అమ్మవారి ప్రసాదం, అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సల్లా రామకృష్ణ, బోనంగి వెంకటరమణ, ధన్నేటిపలాని రాము, కిల్లు రాధాకృష్ణం నాయుడు, లకే రత్నాబాయ్, కారం దేముడు, గబులంగి శంకరరావు, కిల్లు చంద్రమోహన్‌కుమార్ పాల్గొన్నారు.

మత్స్యగుండం ఉత్సవాలకు 24 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



మత్స్యగుండం ఉత్సవాలకు పాడేరు డిపోలో సిద్ధమవుతున్న ఆర్టీసీ బస్సు

పాడేరురూరల్, ఫిబ్రవరి 23: జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రం హుకుంపేట మండలం మఠం పంచాయతీ మత్స్యగుండంలో వెలసిన మత్స్యలింగేశ్వస్వామి తీర్థ మహోత్సవాలు ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో ఆ మూడు రోజులు 24 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నామని పాడేరు డిపో ట్రాన్స్‌పోర్టు అధికారి టి.ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. శివరాత్రి మహోత్సవాల నేపథ్యంలో డిపో పరిధిలో ఎక్కడా బస్సు సర్వీసులను రద్దు చేయకుండా విశాఖపట్నం జిల్లా కేంద్రంలోని మద్దిలపాలెం, వాల్తేరు, సింహాచలం ఆర్టీసీ డిపోలనుంచి 18 బస్సులను రప్పిస్తున్నామని, పాడేరు డిపోలో మరో 6 బస్సులను సిద్ధం చేసి 24 బస్సు సర్వీసులను నడిపే విధంగా చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. ప్రయాణికులు ఎటువంటి ఇబ్బంది లు పడకుండా ఈ బస్సులు ఆలయం వరకు వెళ్లేలా కమిటీ ప్రతినిధులు అవసరమైన మైదానాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన శైవక్షేత్రం

పాడేరురూరల్, ఫిబ్రవరి 23: పాడేరులోని పురతన శైవక్షేత్రం ఉ మా నీలకంఠేశ్వర స్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆల యం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయింది. ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ఆధ్యాత్మిక సేవా బృంద ప్రతినిధులు ఆధ్వర్యంలో వారం రోజులుగా ఆలయ ప్రాంగణంలో ఉన్న వివిధ దేవతా మూర్తులకు రంగులు వేయించారు. 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఏర్పాట్లు చేశారు. 26వ తేదీ రాత్రి జాగరాలకు వీలుగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక భక్తి కార్యక్రమాలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు సింహాచలం నాయుడు తెలిపారు.

మయన్మార్‌లో ఉద్యోగాల పేరిట మోసం

ఆ దేశంలో చిక్కుకుపోయిన ముగ్గురు 'మాకవరపాలెం' యువకులు

స్వదేశానికి రప్పించేలా చర్యలు చేపట్టాలని స్పీకర్‌కు వినతి

మంత్రి కొండపల్లికి ఫోన్ చేసిన అయ్యన్న

స్వగ్రామాలకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని భరోసా

మాకవరపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ముగ్గురు యువకులు, మయన్మార్‌లో ఉద్యోగాల పేరిట మోసపోయారు. గిడుతూరుకు చెందిన ఏజెంట్ల ద్వారా అక్కడకు వెళ్లిన సరైన ఉద్యోగాలు కల్పించలేదు. దీంతో స్వదేశానికి తిరిగిరావాలని భావించారు. అయితే అక్కడ వర్క్ పర్మిట్ సమస్యలు తలెత్తడంతో చిక్కుకుపోయారు. మండలంలోని బూరుగుపాలెం గ్రామానికి వబ్బలరెడ్డి మణికంఠ, గిడుతూరు గ్రామానికి ఇసంశెట్టి రాజేశ్, మరో యువకుడు ఉపాధి కోసం కొంతకాల క్రితం గిడుతూరు గ్రామానికి చెందిన ఇద్దరు ఏజెంట్ల ద్వారా మయన్మార్ దేశానికి వెళ్లారు. ఇందుకోసం ఒక్కొక్కరికి నుంచి రూ.5 లక్షల వరకు ఏజెంట్లు వసూలు చేశారు. ఇందులో సగం సొమ్ము మయన్మార్‌లో ఉద్యోగాలు కల్పించే ఏజెంట్లకు ఇవ్వాల్సి వుంటుందని చెప్పారు. మయన్మార్ వెళ్లిన తరువాత యువకులకు సరైన ఉద్యోగం కల్పించలేదు. పైగా తక్కువ వేతనంతో బలవంతగా పనిచేయించేందుకు ప్రయత్నించారు. ఈ పరిస్థితి ఇబ్బందికరంగా వుండడంతో స్వదేశానికి తిరిగిరావాలనుకున్నారు. అయితే అక్కడ వర్క్ పర్మిట్ సమస్యలు తలెత్తడంతో చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని బూరుగుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కేతిరెడ్డి చిరంజీవితోపాటు యువకుల తల్లిదండ్రులు ఆదివారం స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఎన్‌ఆర్‌ఐ రాష్ట్ర వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ముగ్గురు యువకులను ఇండియాకు రప్పించే చూడాలని కోరారు. మయమ్మార్‌లోని భారత రాయబార కార్యాలయంతో మాట్లాడి, ముగ్గురు యువకులను స్వదేశానికి రప్పించేందుకు అవసరమైన చర్యలు చేపడతానని మంత్రి హామీ ఇచ్చినట్టు స్పీకర్ చెప్పారు.

వరహా నదికి తూట్లు

... 5వ పేజీ తరువాయి

పథకాలకు అతి సమీపంలో కూడా ఇసుక తవ్వుతున్నారు. రామచంద్రపురం పంచాయతీ గూడుపులోవ సమీపంలో వరహా నదిలో భారీ రక్షిత మంచినీటి పథకం వుంది. ఇక్కడి నుంచి కోటవురట్ల, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో 36 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తుంటారు. దీనికి సమీపంలో ఎక్కువ లోతున ఇసుక తవ్వకాలు జరుపుతుండడంతో భూగర్భ జలాలు తగ్గిపోయి, వేసవితో తాగునీటి సరఫరాపై ప్రభావం పడుతుంది. వాస్తవంగా సొంత అవసరాలకు మాత్రమే నదిలో నుంచి ఇసుక తీసుకెళ్లాల్సి వుండగా, ఇక్కడ రాజకీయ నాయకులు ముఠాగా ఏర్పడి, దర్జాగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు.

చికెన్ అమ్మకాలు ఢమాల్

... 5వ పేజీ తరువాయి

తెగనమ్ము కోవడానికి నిర్ణయించుకుని తక్కువ రేటుకు (ఫారం వద్ద లైవ్ కోడి కిలో రూ.50-60కి) అమ్మేస్తున్నారు. అయినా సరే కొనుగోలు దారులు కరవయ్యారు. బర్డ్ ఫ్లూపై భయం వద్దని, చికెన్ తిన్నా ఏమీకాదని ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ అధికారులతోపాటు పౌల్ట్రీ కార్పొరేట్ కంపెనీలు చెబుతున్నప్పటికీ చికెన్ కొనుగోలుకు జనం ముందుకు రావడంలేదు. చోవడరం పట్టణంలో సుమారు 15 చికెన్ షాపులు వున్నాయి. ఆదివారంనాడు ఈ దుకాణాల వద్ద కొనుగోలుదారులు క్యూ కడుతుంటారు. బర్డ్ ఫ్లూ ప్రభావంతో గత వారం నుంచి చికెన్ దుకాణాలు వెలవెలబోతున్నాయి. మటన్ కొనుగోలు చేద్దామంటే కిలో రూ.900 వుండడంతో చేపల దుకాణాల బాటపడుతున్నారు. ఫలితంగా చేపల దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. చేపల రకం, సైజునుబట్టి కిలో రూ.130 నుంచి రూ.160 వరకు విక్రయించారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం పరీక్షకు హాజరుకాలేదు. కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్ష రాసిన భీమిలి మండలం రేఖవానిపాలేనికి చెందిన పి.గంగరాజు మధ్యాహ్నం పరీక్షకు హాజరైన అరగంట తరువాత వాంతులు చేసుకోవడంతో ఇన్విజిలేటర్, చీఫ్‌సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. అతడికి రక్తపోటు తగ్గడంతో వెంటనే ప్రథమ చికిత్స చేసి, సమీపంలోని గాయత్రి వైద్య కళాశాలకు తరలించారు. కాగా నాగరాజు ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇదిలావుండగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షను కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రతబాగ్చి తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో న్యూక్లాస్‌రూమ్ కాంప్లెక్స్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రిజం డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటుచేసిన కేంద్రాలను పరిశీలించారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును డీఆర్వో భవానీశంకర్ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. పోలీసులు అన్ని కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. పరీక్ష వాయిదా వేయాలని మూడు రోజులుగా ఆందోళన చేసిన అభ్యర్థులు ఆదివారం కేంద్రాలకు రాకపోవడంతో పోలీసులు, జిల్లా యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

శివరాత్రికి శివాలయాలు ముస్తాబు


బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం


ధారమఠం ధారమల్లేశ్వరస్వామి ఆలయం

నర్సీపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 26, 27, 28 తేదీలలో మూడు రోజులపాటు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ దీపాల అలంకరణ చేశారు. గుడి మెట్లు పక్కనే బైక్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులు ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారి దర్శనానికి వస్తారు. అక్కడ స్నాన ఘట్టాల వద్ద మునిసిపల్ అధికారులు జల్లు స్నానాలకు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు, ఆడవారు దుస్తులు మార్చుకోవడానికి మరుగు, విద్యుత్ దీపాల తోరణాలు, టెంట్లు ఏర్పాటు చేశారు.

ధారమఠంలో..

గొలుగొండ: మండలంలోని పాతమల్లంపేటలో ధారమఠం ఉమాధార మల్లేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాగారాలు ఉండేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు అన్నసమారాధన ఏర్పాట్లు చేశారు. నర్సీపట్నం నుంచి ధారమఠానికి 15 ఆర్టీసీ బస్సులు వేశారు.

ఏఎల్‌పురంలో..

కృష్ణాదేవిపేట: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు తపస్సు చేసిన ఏఎల్‌పురం స్వయంభూ నీలకంఠేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు అవుతోంది. ప్రతి ఏటా మహాశివరాత్రి నాడు ఇక్కడ గొలుగొండ, కొయ్యూరు మండలాలకు చెందినవందలాది భక్తులు బొడ్డేరు గెడ్డ ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు ఆచరించి నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఆలయం వద్ద పందిరి వేసి విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేస్తున్నారు. బుధవారం నుంచి మూడు రోజులుపాటు అన్నసమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.


ఏఎల్‌పురం నీలకంఠేశ్వరస్వామి ఆలయం

చురుగ్గా బీఎన్ రోడ్డు పనులు


రోలుగుంటలో ఆదివారం బీఎన్ రోడ్డు మరమ్మతులు పూర్తి చేసి సుందరంగా తీర్చిదిద్దిన తారు రోడ్డు

రోలుగుంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట-చోడవరం వరకు బీఎన్ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆదివారం స్థానిక వెలంకాయలపాలెం నుంచి పనులు ఈ పనులు ప్రారంభించారు. చాలా కాలం నుంచి రహదారి గోతులమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ రహదారిని గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా వదిలేశారు. ప్రజలు గగ్గోలు పెట్టినా పట్టించుకోకపోవడతో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్లమరమ్మతులపై దృష్టి పెట్టి నిధులు విడుదల చేసింది. దీంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలో రహదారి కష్టాలుతీరనుండడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం'

చోడవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉదాసీనత వల్ల రాష్ట్రంలో ధాన్యం కొనుగోలులో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల దళారుల బారినపడి రైతులు తీవ్రం గా నష్టపోతున్నారని, గ్రేడింగ్ బాగా ఉన్న ధాన్యానికి సైతం దళారుల వల్ల రైసుమిల్లర్ల మోసాల వల్ల అ న్యాయానికి గురవుతున్నారన్నారు. రైతులను మోసం చేస్తున్న రైసుమిల్లర్లకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అప్పలరాజు హెచ్చరించారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సు

చోడవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యఘర్ యోజన పథకంపై స్థానిక లక్ష్మీపురం వాకర్స్ క్లబ్‌లో ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. సూర్యఘర్ యోజన రాయితీలు సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్క ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఆదా అవుతుందని సోలార్ ఆన్‌లైన్ వెండర్ కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడిగ శ్రీనివాస్, బ్రాం చి మేనేజర్ గోపి, వాకర్స్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఓరుగంటి రాంబాబు, జాజుల జగ్గారావు, ఉపాధ్యాయులు వేగి సూర్య ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోండి

▸▸ కార్మిక శాఖ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు

ఎలమంచిలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ పోర్టల్‌ను ప్రవేశపెట్టిందని స్థానిక కార్మిక శాఖ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. అసంఘటిత రంగ కార్మికుల గుర్తింపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, 16 సంవత్సరాలు నుంచి 59 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన అంఘటితర రంగ కార్మికులుగా అర్హులని తెలిపారు. వార్డు సచివాలయాలు, సీఎస్‌ఈకేంద్రాలు ద్వారా, స్మార్ట్ ఫోన్ ద్వారా నమోదు చేసుకుని గుర్తింపు కార్డు పొందవచ్చునని తెలిపారు. ఆధార్ కార్డు జెరాక్స్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ అవసరం ఉంటుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు గుర్తింపు లభిస్తుందని, ప్రమాద మరణానికి బీమా రూ.2 లక్షలు అందుతుందని, శాశ్వత అంగవైకల్యానికి రూ.ఒక లక్ష ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అల్లూరి జీవిత చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకం

▸▸ అల్లూరి శత వర్ధంతి జాత సభలో వక్తలు


కృష్ణాదేవిపేటలో అల్లూరి, గంటందొరల సమాధులు వద్ద నివాళులర్పిస్తున్న జాత సభ్యులు, విద్యార్థులు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి చరిత్ర భావి తరాలకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక అల్లూరి పార్కుకు శత వర్ధంతి బస్సు జాత చేరుకుంది. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తర్వాత పార్కులోని అల్లూరి, గంటందొరల సమాధులకు, విగ్రహాలకు నిర్వాహకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అల్లూరి జీవిత చరిత్రపై నాటికను ప్రదర్శించారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జాత నిర్వహణ కమిటీ కార్యదర్శి గోవిందరాజులు మాట్లాడుతూ అల్లూరి జీవిత విశేషాలు నేటి తరానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో ఈ జాతాను నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం పౌర చైతన్య వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోలవెన్ను చంద్, కార్యదర్శి సీహెచ్.ప్రమీల, శత వర్ధంతి జాత నిర్వహణ కమిటీ అధ్యక్షుడు డి.రాఘవేంద్ర, ఆల్ ఇండియా డెమోక్రాటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి మహేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గంగాధర్, అల్లూరి యువజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీవీ సత్యనారాయణరావు, కార్యదర్శులు వాడపల్లి వెంకటరమణమ్మ, లాక్కాకుల బాబ్జీ, శ్యామల వరలక్ష్మి, నర్సీపట్నం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో...

నర్సీపట్నం: స్థానిక మెయిన్ రోడ్డులో 150 మంది విద్యార్థులతో అల్లూరి శత వర్ధంతి జాత ర్యాలీ నిర్వహించారు. శనివారం రాత్రి నర్సీపట్నం చేరుకున్న జాత స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో బస చేశారు. జాతా ప్రతినిధులు, విద్యార్థులకు వెలగా నారాయణరావు తదితరులు వసతి, భోజన ఏర్పాట్లు చేశారు. ఆదివారం వాసవీ కల్యాణ మండపం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హైవర్ట్, కవర్ట్ బ్రిటీష్ సైనిక అధికారులు సమాధుల వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఏఐడీఎస్‌వో రాష్ట్ర నాయకులు పి.సురేష్, కె.శివప్రసాద్, త్రినాథ్ పాల్గొన్నారు.


నర్సీపట్నంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జాత ప్రతినిధులు

పార్శిల్ సర్వీసులో విజయనగరం జోన్ ముందంజ



సిబ్బందితో మాట్లాడుతున్న విజయనగరం జోన్-1 సీటీఎం అప్పలనాయుడు

నర్సీపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్శిల్ రవాణాలో విజయనగరం జోన్ రాష్ట్రంలో ముందంజలో ఉందని పీటీడీ డిప్యూటీ సీటీఎం బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం నర్సీపట్నం పీటీడీ డిపోని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్శిల్ సర్వీసులో డోర్ డెలివరీ సేవలను ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించాలన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతుందన్నారు. అనంతరం డిపోలోని ట్రాఫిక్, గ్యారేజ్ విభాగాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎస్ ధీరజ్, డిపో అసిస్టెంట్ మెకానిక్ ఇంజినీర్ పి.ఆచారి పాల్గొన్నారు.

న్యాయ సహాయకులకు దరఖాస్తులు ఆహ్వానం

నర్సీపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధజ్యోతి): జిల్లా న్యాయసేవాధిక సంస్థ అధ్యక్షులు ఆలపాటి గిరిధర్ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థలో న్యాయ సహాయకులుగా స్వచ్ఛందంగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని న్యాయమూర్తి పి.షియాజ్‌ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు ఫొటో జత చేసి నర్సీపట్నం కోర్టులోని మండల న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. కనీస విద్యార్హత పదో తరగతి ఉండాలని, స్వచ్ఛంద సేవా సంస్థల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

వెన్నలపాలెంలో రామాలయం ప్రారంభం


రామాలయానికి లక్ష విరాళం అందజేస్తున్న నందిపల్లి వెంకటరమణ

నాతవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో ఆదివారం రామాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ నందిపల్లి కొండ, రాంబాబు జ్ఞాపకార్థం వారి కుమారుడు టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ రామాలయానికి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ రామాలయ ప్రారంభోత్సవంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు, నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ లాలం అచ్చిరాజు, కోరుప్రోలు వెంకటేష్, అడిగర్ల భాస్కరరావు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

గొలుగొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగంపేటలో ఆదివారం గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి పుర వీధుల్లో గౌరీపరమేశ్వరులను ఊరేగించారు. అనంతరం సోమవారం ఉదయం గౌరీపరమేశ్వరులను నిమజ్జనం చేసేందుకుగాను ఉత్సకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు చిటికెల వరహాలబాబు, రాయపురెడ్డి హరీష్, తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా మోదకొండమ్మకు పూజలు


ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న భక్తులు

మాడుగుల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే మరికొంతమంది భక్తులు ఇళ్లవద్ద అమ్మవారి పండుగను నిర్వహించి, ఘటాలతో ఊరేగింపుగా ఆల యానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక గణేష్ కాలనీకి చెందిన ఓ కుటుంబం నూతన వివాహం చేసుకున్న సందర్భంగా 101 ఘటాలతో పండుగని నిర్వహించుకున్నారు. భక్తులకు స్థానిక న్యాయవాది శ్రీనాద ప్రసాదరావు, ప్రమోదులు ఉచిత అన్న సమారాధనను నిర్వహించారు.

అమ్మవారి హుండీలో సింగపూర్ కరెన్సీ..

మోదకొండమ్మ ఆలయంలోని హుండీ లెక్కించారు. ఇందులో 2 సింగపూరు డాలర్లు ఉన్నాయి. సింగపూర్‌లో ఉంటున్న తెలుగువారు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చినప్పుడు వేసి ఉంటారని కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

తాగునీటిని అందించరూ..

▸▸ నగరంపాలెంలో గిరిజనుల ఆందోళన


గెడ్డ నీరు వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వాలాబు శివారు నగరంపాలెంనకు తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన గిరిజనులు ఆదివారం నిరసన తెలిపారు. 14 శివారు గ్రామాలు ఉండగా జలజీవన్ మిషన్ కింద 13 గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. నగరం పాలెం గ్రామానికి వేసిన పైపులైన్ రి జర్వు పారెస్టులో ఉందని అడ్డంకి పెట్టడంతో ఇంటింటి కొళాయిలకు నోచుకోలేదు. అటవీ శాఖ అధికారులు వె దురు సరఫరా కోసం రోడ్డు నిర్మించారని, పైపులైన్ వేస్తే ఇబ్బందులు ఏమిటని గిరిజనులు ప్రశ్నించారు. వేసవి రావడంతో గెడ్డలు సైతం ఎండిపోతే తాము నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందంటూ కుటుంబాలతో సహా ఆందోళన వ్యక్తంచేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర హెచ్చరించారు.

ఎడ్ల పరుగు పోటీలు రేపు

చీడికాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినగోగాడ గ్రామంలో ఈనెల 25వ తేదీన జిల్లాస్థాయి ఎడ్ల పరుగుపోటీలు నిర్వహించనున్నట్టు టీడీపీ నా యకులు అద్దేపల్లి చినఅప్పారావు, పడాల కన్నం నాయుడుతోపాటు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ మేరకు తీర్థ మహోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు గత ప్రభుత్వం మోసం

▸▸ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం ▸▸ యూటీఎఫ్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్ర ప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటైన యూటీఎఫ్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. అప్రంటీస్ విధానం రద్దు, డీఏల సాధన, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పీఆర్‌సీ, కౌన్సిలింగ్ విధానం అన్నీ పోరాడి సాధించుకున్నవేనని వివరించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ 11వ పీఆర్‌సీలో 23శాతం మాత్రమే ఫిట్‌మెంట్ ఇచ్చి గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులను మోసం చేసిందన్నారు. ఇప్పుడు 12వ పీఆర్‌సీ, డీఏలు, ఆర్థిక బకాయిలు ఇవ్వకుండా ప్రస్తుత ప్రభుత్వం కూడా కాలయాపన చేస్తుందని వాపోయారు. వీటిని సాధించుకోవడానికి పోరాట మార్గాన్ని ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్, జోగా రాజేష్, మామిడి బాబూరావు, సత్యవేణి, వి.రమేష్‌రావు, నాతవరపు సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్టు

కొత్తూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కారులో గంజాయి తరలిస్తున్న తెలంగాణకు చెందిన ఆరుగుర్ని అదుపులోకి తీసుకున్నట్టు అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ జి.రవికుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం సాయంత్రం అనకాపల్లి మండలం కుంచంగి సమీపంలో మాటు వేసి ఓ కారులోతనిఖీలు చేపట్టామన్నారు. అందులో ఆరుగురు వ్యక్తులు ఎనిమిది కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుబడినట్టు చెప్పారు. కారులో నాగర్ కర్నూలుకు చెందిన అలకుంట శివరాజ్, మహబూబ్‌నగర్‌కు చెందిన బి.అశోక్, ఇప్పటి ప్రసాద్, ముత్యాల వివేకానంద, కొమ్మిరి శివలతో పాటు, ఒక మైనర్ ఉన్నాడన్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, మైనర్‌ను బోస్టన్ స్కూల్‌కు తరలించినట్టు చెప్పారు.

వ్యక్తి మృతిపై పోలీసులు కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గాంధీనగరంలోని అద్దె ఇంట్లో నివాసముంటున్న వ్యక్తి ఆకస్మిక మృతిపై ఆది వారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలివి. తమిళనాడుకు చెందిన కదిరేషన్ గణపతి (54), వాణి దంపతులు వ్యాపార రీత్యా చాలాకాలం క్రితం అనకాపల్లి వచ్చారు. అయితే భార్యభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. గణపతి గతంలో వ్యాపారం చేసేవారు. ఇతనికి మద్యం అలవాటు ఉంది. శుక్రవారం సాయంత్రం కనిపించిన వ్యక్తి శనివారం సా యంత్రం వరకు తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని నరసింగరావు కిటికీ తెరిచి చూడగా, లోపల గణపతి మృతి చెంది కనిపించాడు. దీనిపై వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నరసింగరావుపేటలో ఉంటున్న మృతుని భార్య వాణికి ఈ విషయం తెలియడంతో ఆమె వచ్చి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. అతిగా మద్యం సేవించడం వల్లే మృతి చెంది ఉంటాడని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

పెద్దేరులో మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట


స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్ వద్ద తహసీల్దార్, పోలీసు అధికారులు

రావికమతం, ఫిబ్రవరి 23, (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలపై తహసీల్దార్ బి. వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం దాడి చే శారు. ఈ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆ దేశించారు. తవ్వకాలకు ఉపయోగించిన ఎక్సకవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. మండలంలోని మరుపాక రెవెన్యూ పరిధిలో పెద్దేరు కాలువ గట్టుకు సమీపంలో సర్వే నంబరు 237/12లో సోమిరెడ్డి కొండబాబుకు చెందిన భూమి నుంచి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి ట్రాక్టర్లతో గుడివాడకు గత మూడు రోజులుగా తరలిస్తున్నారు. దీనిపై ఆర్‌ఐ సతీష్, వీఆర్వో నాగరాజు తదితరులు శనివారం వెళ్లి మట్టి తరలింపును నిలిపివేయాలని కోరినా సోమిరెడ్డి శ్రీను(వీఆర్‌పీ) ఎదురు తిరిగాడు. దీంతో వారు విషయం తహసీల్దార్‌కు వారు తెలియజేశారు. అ లాగే, ఆదివారం 'మట్టి అక్రమ రవాణాకు రెవెన్యూ అడ్డుకట్ట' అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం కథనం వచ్చింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ బి. వెంకటరమణ, స్థానిక ఎస్సై ఎం. రఘు వర్మ, ఆర్‌ఐ సతీష్, వీఆర్వో నాగరాజు మట్టి తవ్వకాల ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. జిరాయితీ భూమి అయినా, అనుమతులు లేకుండా మట్టిని తవ్వకాలు చేపట్టి మట్టిని విక్రయించడం, అలాగే, భూమి స్వభావం మార్చడం నేరమని తహసీల్దార్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎక్స్ కవేటర్‌ను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఎక్స్‌కవేటర్ యజమాని, వీఆర్‌పీ శ్రీను పైన కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

దేవరాపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేచలంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా కార్య క్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు పాకల కామేశ్వరరావు శర్మ ఆధ్వర్యంలో 43 అడుగుల ఏకశిలా ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంలో వినాయక రామలక్ష్మణ సైత విగ్రహాలను నెలకొల్పారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు.సత్యన్నారాయణమూర్తి దంపతులు హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గవిరెడ్డిరామానాయుడు, జడ్పీటీసీ సభ్యుడు కర్రిసత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, నాయకులు చిటిమిరెడ్డి.సూర్యనారాయణ, సర్పంచి శటారినాయుడు, గ్రామ ప్రజలు తది తరులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ఆంజనేయస్వామికి లక్ష సింధూర కుంకుమార్చన


చినపాచిలలో ఆంజనేయ కుంకుమార్చన చేస్తున్న భక్తులు

రావికమతం: మండలంలో చిన పాచిల గ్రామంలో ఆంజనేయస్వామికి భక్తులు ఆదివారం లక్ష సింధూర కుంకుమార్చన పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ 28వ వార్షిక మహోత్సవం సందర్భంగా ఈ గ్రామంలో 50 మంది భక్తులు స్వామి మాలాధారణ చేసి గత 20 రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆరవెల్లి పవన్‌కుమార్ లక్ష సింధూర కుంకుమార్చన పూజ నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నవరం పంచాయతీ జంక్షన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఎస్ఎన్‌డీ సేవానిధి ఛారిటబుల్ ట్రస్ట్, సాలాపు నర్సింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో కేర్ ఆసుపత్రి, వాసన్ ఐకేర్ ఆసుపత్రికి చెందిన వైద్యులు స్థానికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శరత్ చంద్ర, పి. ఉదయ్ కృష్ణ పాల్గొన్నారు.

నేడు కల్యాణపులోవ ఉత్సవాలపై సమీక్షాసమావేశం

రావికమతం, ఫిబ్రవరి 23, (ఆంధ్రజ్యోతి): మండలంలో చీమలపాడు పంచాయతీ కల్యాణపులోవలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 26 నుంచి 28 వరకూ జరిగే ఉత్సవాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ బి. వెంకట రమణ తెలిపారు. ఈసమావేశానికి నర్సీపట్నం ఆర్డీవో రమణ హాజరవుతారన్నారు. రెవెన్యూ, పోలీస్, దేవదాయ, పంచాయతీరాజ్ తదితర అధికారులుహాజరుకావాలన్నారు.

చెరకు తోటలు దగ్ధం

చోడవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నవరం సమీపంలో చెరకు తోటలు ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో చాకిపల్లి గ్రామానికి చెందిన రైతులకు చెందిన 6 ఎకరాల మేర చెరకుతోటలు కాలిపోయాయి. సమాచారం మేరకుస్థానిక అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు.

ప్రతిభా పరీక్షలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) కాశీపురం జడ్పీహైస్కూల్‌లో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. వివిధ పాఠశాలలనుంచి 80 మంది పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి డి.చరిష్మా, ద్వితీయ జి.లలితకుమార్, మూడు సునీత, నాల్గవ బహుమతి బి.హర్షిత మరో ఐదుగురికి వరుసగా బహుమతులు అందజేశారు. సర్పంచ్ ఆదిరెడ్డివరలక్ష్మి, ఉపసర్పంచ్ ఆదిరెడ్డి.సింహాచలంనాయుడు, ఆదిరెడ్డి. గోవింద, సూరెడ్డి. ఈశ్వరరావు, కొటాన రాంబాబుపాల్గొన్నారు.